సాక్షి సూర్యాపేట

ఆదివారం ၊ 23 ၊ జూన్ ၊ 2024



ఫణిగిరికి బౌద్ధ శిల్పాలు

అంతర్జాతీయ ప్రదర్శనకు తీసుకెళ్లిన బౌద్ధ శిల్పాలు శనివారం నాగారం మండలం ఫణిగిరి మ్యూజియానికి చేరాయి. - 8లో



బాల శాస్త్రవేత్తలు భళా

ఇన్‌స్పైర్ మనక్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఆరు ప్రాజెక్టులు ఎంపిక అయ్యాయి. - 8లో

గరిష్టం / కనిష్టం
$34^0 / 25^0$

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ

నూతనకల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కల్లుగీత కార్మిక సంఘం నాయకుడు తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ ఆదివారం నూతనకల్‌లో నిర్వహిస్తున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్గూరి గోవింద్ తెలిపారు. శనివారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద గీత కార్మిక కుటుంబంలో జన్మించి పాలేరుగా పనిచేస్తూ భూస్వాముల ఆగడాలపై తిరగబడి ప్రజలను విముక్తి చేసిన మహానాయకుడు తొట్ల మల్సూర్ అని కొనియాడారు. స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా సాక్షి దినపత్రిక ఎడిటర్ వర్ధెల్లి మురళి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొంపెల్లి మల్లారెడ్డి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి హాజరవుతారని తెలిపారు. విలేకరులత సమావేశంలో గీత కార్మిక సంఘం నాయకులు తొట్ల ప్రభాకర్‌గౌడ్, పులుసు సత్యం పాల్గొన్నారు.

పత్తి పంట సాగులో సలహాలు తీసుకోవాలి



మాచారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

పెన్‌పహాడ్: పత్తి పంట సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామంలో పత్తి పంటల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం దూపహాడ్ గ్రామంలో విత్తన షాపులు పరిశీలించారు. విత్తన డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతూ విత్తనాలు అమ్మేటప్పుడు రైతులకు బిల్లు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మకాలు చేయాలని, ఏమైనా తప్పిదాలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.కృష్ణసందీప్, ఏఈఓ గోపి, విత్తన డీలర్ బిట్టు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతికి దరఖాస్తు చేసుకోవాలి

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట ఎస్‌టీఓ పరిధిలో సర్వీస్, ఫ్యామిలీ పెన్షన్లు పొందుతున్న వారు పెన్షన్‌పై మధ్యంతర భృతి (ఐఆర్) కోసం సూర్యాపేట ట్రెజరరీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు తెలిపారు. శనివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కొంతకాలంగా సూర్యాపేట ఎస్‌టీఓ పరిధిలో సర్వీస్, ఫ్యామిలీ పెన్షన్లపై మధ్యంతర భృతి ఇవ్వడం లేదని, ఈ విషయమై సూర్యాపేట డిప్యూటీ ట్రెజరర్ దృష్టికి తీసుకెళ్లడంతో పెన్షన్‌పై ఐఆర్ చెల్లించేందుకు అంగీకరించారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావు, కోశాధికారి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం ఉత్సవ మూర్తుల జోడు సేవలను మాడవీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నీట్ పరీక్షను రద్దుచేయాలి



కోదాడ-జడ్చర్ల రహదారిపై రాస్తారోకో చేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

చిలుకూరు: నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేసి రీ ఎగ్జామ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం కోదాడ-జడ్చర్ల రహదారిపై చిలుకూరు మండల కేంద్రం సమీపంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బోయిళ్ల నవీన్ మాట్లాడుతూ దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్షలో అవకతవకలు జరగడం దారుణమన్నారు. ప్రశ్న పత్రం లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వినోద్, జంగంపల్లి సాయికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరింత 'మద్దతు'

14 రకాల పంటలకు మద్దతు ధర పెంచిన కేంద్రం

- అత్యధికంగా కందులకు రూ.550, పత్తికి రూ.501..
- రూ.117 పెంపుతో రూ.2,300కు చేరిన ధాన్యం ధర
- ఒకవైపు బోనస్.. మరోవైపు మద్దతు దక్కనుండడంతో రైతుల్లో ఆనందం



పెంచిన మద్దతు ధరలు (క్వింటాకు రూపాయలలో..)

రకం	పెంపు	ఇకనుంచి మద్దతు ధరలు
వరి సాధారణం	117	2,300
వరి గ్రేడ్-ఏ	117	2,320
మొక్కజొన్న	135	2,225
కందులు	550	7,550
పెసర	124	8,682
మినుములు	450	7,400
వేరుశనగ	406	6,783
పత్తి సాధారణం	501	6,620
పత్తి గ్రేడ్-ఏ	501	7,020

భానుపురి (సూర్యాపేట): వానాకాలం (2024– 25) సీజన్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలిచేందుకు 14 రకాల పంటలకు కనీస మద్దతు ధరను పెంచింది. ఈ 14 పంటల్లో జిల్లాలో పండేవి 7, 8 రకాలు ఉండడంతో జిల్లా రైతాంగానికి ఎంతో మేలు జరగనుంది. ఇందులో కందులకు అత్యధికంగా రూ.550, పత్తికి రూ.501, వరి పంటకు రూ.117 చొప్పున పెంచింది. దీంతో వరి సాధారణ రకానికి క్వింటాకు రూ.2,300లు, ఏ గ్రేడ్ రకానికి రూ.2,320ల మద్దతు ధర అందనుంది. ఈ ధరలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమలు చేయనున్నారు.

వరి రైతుల్లో ఉత్సాహం

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వరి ధాన్యానికి క్వింటాకు రూ.500ల బోనస్ ఇస్తామని ప్రకటించగా.. ఈ వానాకాలం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే మార్గదర్శకాలు రానుండగా.. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఉన్న కనీస మద్దతు ధర సాధారణ రకం రూ.2,183, ఏ గ్రేడ్ రకం రూ.2,203లకు గాను క్వింటాకు రూ.117లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో దాదాపు 4.21 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు కానుంది. సాగయ్యే అన్ని పంటల్లోనూ ఈ పంటదే అగ్రస్థానం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిర్ణయం, త్వరలోనే బోనస్‌పై రానున్న మార్గదర్శకాలతో జిల్లాలో అత్యధిక మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలతో వరి సాగుచేసే రైతుల్లో ఉత్సాహం నెలకొంది.

ఇతర పంటలకూ భారీగానే..

జిల్లాలోని రైతులు వరితో పాటు పత్తి, కందులు, పెసర, వేరుశనగ, జొన్నలు, మినుములు పండిస్తుంటారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన కనీస మద్దతు ధరల్లో ఈ పంట ధరలు ఉండగా.. కొన్నింటి మద్దతు ధరను భారీగా పెంచింది. వరి తర్వాత అత్యధికంగా 80 నుంచి 90వేల ఎకరాల వరకు సాగయ్యే పత్తి ధరను క్వింటాకు రూ.501లు పెంచగా దీంతో సాధారణం రకానికి రూ.7,121, ఏ గ్రేడ్ రూ.7,521లకు మద్దతు ధర చేరింది. ఇక కందులకు రూ.550, మినుములకు రూ.450, వేరుశనగ రూ.406, పెసల్లకు రూ.124, మొక్కజొన్నకు క్వింటాకు రూ.135ల చొప్పున పెంచింది. జిల్లాలోని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో కొద్దిరోజులుగా కందులకు రూ.11వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వీటి మద్దతు ధరను పెంచడంతో రానున్న కాలంలో వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని రైతాంగం భావిస్తోంది. కాగా పంటలకు మద్దతు ధరలను పెంచడంపై జిల్లా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్‌గా బోళ్ల వెంకట్‌రెడ్డి



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్నికల అధికారి శ్రీనివాస్

నల్లగొండ అగ్రికల్చర్ : నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (ఎన్‌డీసీఎంఎస్) చైర్మన్‌గా కేతేపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆరు నెలలుగా చైర్మన్ పదవి ఖాళీగా ఉండడంతో జిల్లా సహకార శాఖ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. శనివారం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయగా 9 మంది డైరెక్టర్లలో బోళ్ల వెంకట్‌రెడ్డి ఒక్కరే చైర్మన్ పదవికి నామినేషన్ వేశారు. దీంతో ఎన్నికల అధికారి, సూర్యాపేట జిల్లా సహకార ఆడిట్ అధికారి జి.శ్రీనివాస్.. చైర్మన్‌గా బోళ్ల వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ వెంకట్‌రెడ్డికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్నికల అధికారి శ్రీనివాస్‌తో కలిసి ఎన్నిక పత్రాన్ని అందజేశారు. అనంతరం గజమాలతో వెంకట్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఎన్‌డీసీఎంఎస్ బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, బిజినెస్ మేనేజర్ నాగిళ్ల మురళి, రాఘవాచారి డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రవాణాభారం లేకుండా యూరియా సరఫరా చేయాలి

ఎన్‌డీసీఎంఎస్‌కు లారీల ట్రాన్స్‌పోర్టు భారం లేకుండా యూరియాసరఫరా చేయించాలని కోరుతూ శనివారం డీసీఎంఎస్‌కు వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బిజినెస్ మేనేజర్ నాగిళ్ల మురళి వినతిపత్రం అందజేశారు. యూరియా సరఫరా చేసిన లారీలకు ట్రాన్స్‌పోర్టు చార్జీలు రూ.5 వేలు చెల్లించాలని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారని దీనివల్ల యూరియాను ఎమ్మార్పీ ధరకు అమ్మలేమని తెలిపారు. రవాణా భారం లేకుండా యూరియా సరఫరా చేయించాలని మంత్రి కోమటిరెడ్డిని కోరారు.

శాస్త్రోక్తంగా నారసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతకాలార్చన, నిత్యహోమం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణం జరిపి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా శుక్రవారం రాత్రికే ఆలయానికి చేరుకున్న భక్తులు తెల్లవారుజాముననే కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- పేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి తనిఖీ



మందుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఐసీయూలో బెడ్స్‌ను నిరంతరం శానిటేషన్ చేపట్టాలని, ఆస్పత్రుల్లో ఎక్కడ కూడా మందుల కొరత లేకుండా చూడాలన్నారు. జీజీహెచ్‌కి కావాల్సిన సామగ్రిని ఒక నివేదిక రూపంలో అందజేయాలన్నారు. క్యాజువాలిటీ, ఆర్థోపెడిక్ వార్డులను తనిఖీ చేసి వైద్యసేవలు, మందుల వివరాలపై ఆరా తీశారు. ఆయన వెంట వైద్యులు ఉన్నారు.

'మహిళాశక్తి'కి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళాశక్తి కార్యక్రమం విజయవంతానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, మండల సమాఖ్య ప్రెసిడెంట్లు, సెక్రటరీలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో మహిళా సంఘాలను బలోపేతం చేయడం కోసం మహిళాశక్తి ద్వారా 14 రకాల కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అందులో విద్యార్థులకు అందించే యూనిఫాం అందించి జిల్లాకు మంచిపేరు తెచ్చారన్నారు. మహిళాశక్తి కింద మైక్రో ఎంటర్‌ప్రైజెస్, కుట్టుకేంద్రాలు, పాడి పశువులు, బ్యాక్‌యాడ్ పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ అవుట్‌లేట్లు, మిల్క్ ప్యాలెస్, మీసేవ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కస్టం హైరింగ్ కేంద్రాలు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలన్నారు. రూ.86కోట్ల పెట్టుబడులతో 8,623 యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే శ్రమించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదనరాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో రక్త హీనతను గుర్తిస్తాం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం

సూర్యాపేట: జిల్లాలో దాదాపు 21 గిరిజన వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు సికిల్ సెల్ అనీమియా గుర్తించుటకు ప్రత్యేక రక్త పరీక్షల క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కోటాచలం అన్నారు. శనివారం సూర్యాపేటలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరి సమన్వయంతో గిరిజన హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లోనూ వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ఈ రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అనసూయ, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ పి.వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ ఎం డీ.నిరంజన్, డాక్టర్ జి.చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు జయశ్యామ్ సుందర్, నాజియా పాల్గొన్నారు.

18 ఏళ్లుగా ఉద్యోగ భద్రత లేక..!

- చాలీచాలని జీతాలతో గడుపుతున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు
- తమ సమస్యలు తీర్చాలని గతేడాది 21రోజుల పాటు దీక్షలు
- కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని వేడుకోలు
- జిల్లావ్యాప్తంగా 832 మంది ఉద్యోగులు



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు (ఫైల్)

సూర్యాపేట టౌన్: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు పద్దెనిమిదేళ్లుగా ఉద్యోగ భద్రత లేక చాలీచాలని వేతనాలతో జీవితం గడుపుతున్నారు. తమ సమస్యల్ని పరిష్కరించాలనే డిమాండ్‌తో దశలవారీగా ఉద్యమాన్ని చేపట్టి గత ఏడాది అక్టోబర్‌లో 21 రోజుల పాటు కలెక్టరేట్‌ల ఎదుట నిరసన దీక్షలు చేశారు. దీక్షలు చేస్తున్న సందర్భంగా అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా నేటికీ నెరవేరలేదని కాంట్రాక్టు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌వీఎం నుంచి ఎస్‌ఎస్‌ఏలోకి..

రాజీవ్ విద్యా మిషన్ (ఆర్‌వీఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను 2006లో కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో సమగ్రశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ప్రాజెక్టు కిందకు తెచ్చారు. అప్పటి నుంచి వీరంతా విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో బోధన, బోధనేతర విధులు నిర్వహిస్తూనే తమకు టైం స్కేల్ వర్తింపజేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల విధులు..

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు (సీఆర్‌పీ)లు నియమించి బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించేలా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సదరు ఉపాధ్యాయులు సెలవులో వెళ్లిన సమయంలో ఆ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలలకు కాంప్లెక్స్ పాఠశాలలకు అనుసంధానంగా మెలుగుతూ మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు సకాలంలో అందేలా చూస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు దీటుగా సీఆర్పీలు పనిచేస్తూ వస్తున్నారు. డిగ్రీలు, బీఈడీలు పూర్తి చేసినా వారికి అందే వేతనం అంతంత మాత్రమే. రోస్టర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెరిట్ ఆధారంగా ఎంపికై విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రతకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరుతూ వస్తున్నా తమ ఆశలు నెరవేడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏయే విభాగంలో ఎంతమంది అంటే..

జిల్లాలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు 832 మంది ఉన్నారు. వీరిలో ఎమ్మార్సీలో ఐఈఆర్‌పీలు 46 మంది, భవిత సెంటర్లలో వలంటీర్లు 26, డీఈఓపీ 18, ఎంఐఎస్‌లు 16, మెసెంజర్లు 16, సీఆర్‌పీలు 78, పీటీఐలు 162, కేజీబీవీల్లో 19 మంది, పీజీ సీఆర్‌టీలు 32, సీఆర్‌టీ 134, పీఈటీలు 18, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు 12, క్రాఫ్ట్ టీచర్లు 14, కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్ అకౌంట్స్ 11, ఏఎన్ఎంలు 16, మహిళా వాచ్ మెన్‌లు, కుకింగ్, స్వీపర్లు 161, టీఎస్ఎంఎస్ హాస్టళ్లలో 53 మంది ఉన్నారు. వీరంతా నెలకు విభాగాల వారీగా రూ.7,500 నుంచి రూ.35వేల వేతనాలతో పనిచేస్తున్నారు.

హామీని నిలబెట్టుకోవాలి



గతేడాది తాము నిరసన దీక్షలు చేస్తున్న సమయంలో తమకు సంఘీభావం తెలిపి మా ప్రభుత్వం రాగానే మీ సమస్యలన్నీ పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకొని మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి.

– కె.అంజయ్య, ఎంఐఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, సూర్యాపేట

తక్కువ జీతంతో పనిచేస్తున్నాం



సమగ్ర శిక్షా ఉద్యోగులం అతి తక్కువ జీతంతో పని చేస్తున్నాం. మమ్ములను క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలి. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరీ డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– కాంపాటి శ్రీనివాస్, క్లస్టర్స్ రిసోర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సూర్యాపేట

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు ఏదైనా ప్రమాదంలో మరణిస్తే వెంటనే ఎక్స్‌గ్రేషియా చెల్లించిన కుటుంబాన్ని ఆదుకోవాలి. అలాగే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. 61 సంవత్సరాలు నిండిన వారికి రూ.20లక్షలు ఇచ్చి ఉద్యోగ విరమణ కల్పించాలి.

– ఎస్‌కే.సయ్యద్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ యూనియన్, జిల్లా జనరల్ సెక్రటరీ

క్లుప్తంగా

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి క్రైం: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భువనగిరి పట్టణ పరిధిలోని టీచర్స్‌కాలనీ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. పట్టణంలోని సింగన్నగూడేనికి చెందిన కడమంచి రాములు(65) ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ తగాదాలతో జీవితంపై విరక్తి చెందాడు. టీచర్స్ కాలనీ సమీపంలో ఒక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై అరవింద్ కుమార్ తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం


వెంకటనర్సమ్మ

గుర్రంపోడు: పింఛన్ తీసుకునేందుకు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన గుర్రంపోడు మండలంలోని తెరాటిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తెరాటిగూడెం గ్రామానికి చెందిన గున్‌రెడ్డి వెంకటనర్సమ్మ(62) ఈ నెల 20న వృద్ధాప్య పింఛన్ తీసుకునేందుకు చేపూరు గ్రామానికి వెళ్లి రాత్రి వరకూ ఇంటికి తిరిగిరాలేదు. చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు కున్‌రెడ్డి రఘువర్ధన్‌రెడ్డి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మామిడాల గ్రామంలో యువకుడు..

రామగిరి(నల్లగొండ): మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన నగిరి నవీన్(23) ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చదువుతున్నాడు. గత నెల 21వ తేదీన ఇంటి నుంచి యూనివర్సిటీకి వెళ్లాడు. వెళ్లిన మూడు రోజుల అనంతరం ఫోన్ స్విచ్‌ఆఫ్ అయింది. తండ్రి నగిరి సైదులు శనివారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్‌ఐ రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముద్దాపురం గ్రామంలో మరొకరు..

వలిగొండ: మండలంలోని ముద్దాపురం గ్రామంలో యువకుడు అదృశ్యమయ్యాడు. గ్రామానికి చెందిన సామ చంద్రారెడ్డి (29) ఈనెల 17వ తేదీ నుంచి కనిపించడం లేదని అతడి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. యువకుడు కనిపించకుండా పోవడానికి ప్రేమ వ్యవహారం కారణమై ఉంటుందేమోనన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్‌లాల్ తెలిపారు.

భూతగాదాలో అన్నపై తమ్ముడి దాడి


ధనమూర్తి తలకు అయిన గాయం

చిలుకూరు: భూతగాదాలో అన్నపై తమ్ముడు దాడి చేసిన ఘటన శనివారం చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పందిర ధనమూర్తి తన పొలంలో గురువారం సాగు పనులు చేస్తుండగా అతడి తమ్ముడు వీరబాబు వచ్చి భూముల కొలతల్లో తేడాలు ఉన్నాయని ధనమూర్తిపై ఘర్షణకు దిగాడు. కోపోద్రిక్తుడైన వీరబాబు అందుబాటులో ఉన్న గడ్డ పారతో ధనమూర్తి తలపై కొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయంపై బాధితుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురభి రాంబాబు గౌడ్ తెలిపారు. ధనమూర్తి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బాల శాస్త్రవేత్తలు భళా

- రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ
- ఉమ్మడి జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన ఆరు ప్రాజెక్టులు

విద్యార్థుల్లోని విజ్ఞానాన్ని వెలికి తీసేందుకు భారత శాస్త్ర సాంకేతిక సలహా మండలి న్యూఢిల్లీ నేషనల్ ఇన్‌ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి ఆరు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఇందులో నల్లగొండ జిల్లా నుంచి మూడు, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు ఉన్నాయి.

పెడల్‌తో నిర్వహించే పిండి మిల్లు


పిండి మిల్లు పరికరం చూపుతున్న మణికంఠ

భువనగిరి: యాదగిరిగుట్ట మండలం వంగపల్లికి చెందిన విజ్ఞాన్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి రేగు మణికంఠ పెడల్‌తో నిర్వహించే పిండి మిల్లు రూపొందించాడు. సునీత గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. పిల్లలు ఉపయోగించే సైకిల్‌కు ఉండే చైన్‌కు పిండి మిల్లు ఇంజన్‌కు లింక్ చేశారు. సైకిల్ పెడల్‌ను తొక్కినప్పుడు ఇంజన్‌లో ఉన్న రాడ్ల మధ్యలో బియ్యం గింజలు వేయాలి. పెడల్‌ను తొక్కుతున్న క్రమంలో రాడ్ మధ్య వేసిన బియ్యం గింజలు పిండిగా మారుతుంది. అవసరం మేరకు రవ్వ పిండిని కూడా తయారు చేసుకోవచ్చు. పెద్దగా ఖర్చు లేకుండా ఇళ్లలోనే ఈ పరికరం రూపొందించుకోవచ్చు.

రైతుల కోసం మోకాలి ప్యాడ్లు


భార్గవి

భువనగిరి: పంట చేలల్లో కలుపు మొక్కలు తొలగించేందుకు రైతులు ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి సమస్యలు లేకుండా శ్రమ లేకుండా సులభంగా మోకాలి ప్యాడ్ల ద్వారా కలుపు మొక్కలు తొలగించే పరికరాన్ని రాజాపేట మండలం పారుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ 10వ తరగతి విద్యార్థి బుగ్గ భార్గవి రూపొందించింది. గైడ్ టీచర్‌గా బుస్సా రమేష్ వ్యవహరించారు. ఐరన్ పైపులు తీసుకుని యూ ఆకారంలో తయారు చేశారు. పైపుల పైభాగంలో కూర్చునే విధంగా స్పాంజ్‌తో ఏర్పాటు చేశారు. ఈ ప్యాడ్లతో రైతులు మోకాళ్ల నొప్పులు లేకుండా వరి, పత్తి పంటలతో పాటు ఇతర పంటల్లోని కలుపు మొక్కలు తొలగించవచ్చని విద్యార్థి, గైడ్ టీచర్ పేర్కొన్నారు.


భార్గవి రూపొందించిన కలుపు మొక్కలు తీసే మోకాలి ప్యాడ్

బెడ్ ఫర్ నాన్ మూవబుల్ పర్సన్స్ ఫర్ వాష్‌రూమ్


స్పెషల్ బెడ్ ఫర్ నాన్ మూవబుల్ పర్సన్స్ ఫర్ వాష్‌రూమ్ పరికరాన్ని చూపుతున్న సందీప్

కనగల్: కనగల్ మండలం దోరేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బొల్లం సందీప్ గైడ్ టీచర్ బేతి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ బెడ్ ఫర్ నాన్ మూవబుల్ పర్సన్స్ ఫర్ వాష్‌రూమ్ ప్రాజెక్టు రూపొందించాడు. సందీప్ నానమ్మకు పక్షవాతం రావడంతో ఎటు కదలలేని పరిస్థితి. తన అవసరాలు తానే తీర్చుకునేలా ఒక పరికరాన్ని తయారు చేయాలని ఆలోచించి గైడ్ టీచర్ సాయంతో దీనిని రూపొందించాడు. ఇది సాధారణ మంచం మాదిరిగా ఉన్నప్పటికీ ఎటు కదలలేని స్థితిలో ఉన్న వ్యక్తి దీనిపై పడుకుని హైడ్రాలిక్ బటన్స్ సాయంతో వాష్ రూమ్ వెళ్లేలా ప్రత్యేక అరేంజ్‌మెంట్ చేశారు. ఉపయోగించిన తర్వాత మళ్లీ హైడ్రాలిక్ బటన్ నొక్కగానే యథాస్థానానికి బెడ్ వస్తుంది. దీని కింది నుంచి డబ్బాతో పాటు పైప్‌లైన్ బయటకు వేసుకోవడానికి అవకాశం ఉంది. కదలలేని స్థితిలో ఉన్న వారికి ఈ బెడ్ ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు.

ఫ్రెండ్లీ డ్రమ్ సీడర్


డ్రమ్ సీడర్‌ను చూపుతున్న విద్యార్థి ఈశ్వర్‌సాయి, బయో సైన్స్ ఉపాధ్యాయురాలు మట్టమ్మ

మిర్యాలగూడ: దామరచర్ల మండలం కొండ్రపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సిగపట్ల ఈశ్వర్ సాయి బయో సైన్స్ టీచర్ మట్టమ్మ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ డ్రమ్ సీడర్ అనే పరికరాన్ని రూపొందించాడు. దీని ద్వారా విద్యుత్, యంత్ర పరికరాలు అవసరం లేకుండా సమానమైన దూరంలో విత్తనాలు నాటుకునే అవకాశం ఉంటుంది. ఈ డ్రమ్ సీడర్ ద్వారా మొక్కలకు సరైన గాలి, వెలుతురు అందడంతోపాటు తక్కువ నీటి వినియోగం, మొక్కలకు రోగ నిరోధక శక్తిని కలిగి పంట ఎక్కువ దిగుబడి వస్తుంది. ఈ పరికరం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఆవు పేడను ఎత్తే పరికరం



భువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లా చందుపట్ల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి మణికంఠ ఆవు పేడను ఎత్తే పరికరం రూపొందించాడు. గైడ్ టీచర్‌గా వేణుగోపాల్ వ్యవహరించారు. ఈ పరికరం తయారు చేసేందుకు మెటల్ పైపులు, చక్రాలు, ప్లాస్టిక్ షీట్ ఉపయోగించారు. ముందుగా ఆవు పేడను ఎత్తే ట్రాలీ ముందు భాగంలో ప్లాస్టిక్ షీట్ ఉంటుంది. దాని ముందు తుడువు కర్ర ఉంచారు. ఇది ట్రాలీ హ్యాండిల్ దగ్గర జత చేయబడుతుంది. వినియోగదారు పేడ ద్వారా తుడువు కర్రను లాగి షీట్‌పై సేకరిస్తారు. షీట్ రెండు వైపులా కనెక్ట్ చేయబడతాయి. షీట్‌ను పైకి లేపడం మరియు లాగినప్పుడు సేకరించిన పేడ టబ్‌లో పడేలా చేస్తుంది.

వైపర్ ఫర్ బైక్ హెల్మెట్ వాటర్ క్లీనింగ్


సంక్రాంతి సోనియా



త్రిపురారం: మండలంలోని దుగ్గెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి సోనియా, గైడ్ టీచర్ ముదిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో వైపర్ ఫర్ బైక్ హెల్మెట్ వాటర్ క్లీనింగ్ ప్రాజెక్టు రూపొందించింది. వర్షాలు కురిసే సమయంలో మోటర్ సైకిల్‌పై హెల్మెట్ ధరించి ప్రయాణించడం చాలా కష్టం. హెల్మెట్ గ్లాస్‌ను పైకి అడ్జెస్ట్ చేయడం వల్ల ముఖంపై వర్షపు నీరు పడి ప్రయాణం ఇబ్బందిగా ఉంటుంది. వర్షంలో కూడా ప్రయాణం చేసేందుకు వీలుగా ఈ వైపర్ ఫర్ బైక్ హెల్మెట్ వాటర్ క్లీనింగ్‌ను రూపొందించారు. హెల్మెట్‌పై వైపర్ బ్యాటరీలతో కూడిన రొటేట్ ఎలక్ట్రిక్ మెటార్ విధానంతో పని చేస్తుంది. దీనికి మినీ వైపర్ బ్లేడ్, ఆన్ ఆఫ్ స్విచ్, ఎలక్ట్రిక్ మోటార్, రొటేట్ ఆర్మ్ మోటార్ వినియోగించారు.

బైక్ అదుపు తప్పి యువకుడు దుర్మరణం


జావీద్ (ఫైల్)

నాంపల్లి: బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నాంపల్లి మండలంలోని వడ్డెపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని నేవిళ్లగూడెం గ్రామానికి చెందిన ఎస్‌కే జావీద్(21), అదే గ్రామానికి చెందిన ఎస్‌కే లతీఫ్ ఇద్దరు బైక్‌పై స్వాములవారి లింగోటం గ్రామంలో ట్రాక్టర్‌లో రాళ్లు లోడ్ చేయడానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వడ్డెపల్లి మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టారు. దీంతో జావీద్ అక్కడికక్కడే మృతి చెందగా లతీఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. లతీఫ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. జావీద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండకు తరలించారు. కాగా.. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


నాగారం: పట్టుబడిన పీడీఎస్ బియ్యం చూపుతున్న పోలీసులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం రాజానాయక్ తండాలో బానోతు రంగమ్మ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం తెలిపారు. అనుమతులు లేకుండా పీడీఎస్ బియ్యాన్ని విక్రయించినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాగారంలో 12 క్వింటాళ్లు

నాగారం: మండలంలో అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. రాజాపేట మండలం పుట్టగూడేనికి చెందిన గూగులోతు రాజు, మాలోతు హనుమంతు, మాలోతు రాజేశ్, సరిపంగ గణేష్‌లు శనివారం నాగారం మండలంలోని మాచిరెడ్డిపల్లి, ఈటూరు చుట్టు పక్కల గ్రామాల్లో 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి టాటా ఏస్ వాహనంలో భువనగిరికి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు నలుగురిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే వేముల వీరేశం ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్ హ్యాక్

నకిరేకల్: నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఎక్స్(ట్విట్టర్) అకౌంట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హ్యాక్ చేశారు. ఈమేరకు ఆయన తన క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అకౌంట్ నుంచి వచ్చే ఎలాంటి సందేశాలు నమ్మొద్దని పేర్కొన్నారు.

యాదాద్రి ఆలయాధికారి సస్పెన్షన్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలోని లీగల్ అండ్ లీజెస్ విభాగం పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణశర్మను సస్పెండ్ చేస్తూ శనివారం ఆలయ ఈఓ భాస్కర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి సమాచారం, అధికారుల ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు కావడం, ఫైల్స్ నిర్వహణ, కోర్టుకు సంబంధించిన కేసుల్లో తీవ్ర ఆటంకం కలిగించినందుకుగాను సస్పెండ్ చేసినట్లు ఈఓ తెలిపారు.

ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గరిడేపల్లి: మండల పరిధిలోని గడ్డిపల్లి కేవీకేలో ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళా శాల ప్రిన్సిపాల్ బండి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. గడ్డిపల్లి ఉద్యాన పాలి టెక్నిక్ కళాశాలలో 40 సీట్లు ఉన్నాయని జూలై 15వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. పాలిసెట్‌లో వచ్చిన ర్యాంకు లేదా దానికి సమానమైన పరీక్షా ద్వారా ప్రతిభ ఆధారంగా విద్యార్థులు అడ్మిషన్లు ఉంటాయని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి కనీసం 15 సంవత్సరాలు, గరిష్టంగా 22 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

బ్యాంక్ అకౌంట్ నుంచి నగదు మాయం

- మూడు విడతలుగా రూ.1,70,900 కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1,70,900 నగదు చోరీ చేశారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆటోమొబైల్ షాపు యాజమాని రాగిరెడ్డి గోపాల్‌రెడ్డికి శనివారం గుర్తు తెలియని వ్యక్తులు కాల్ చేశారు. అనంతరం తన ఎస్‌బీఐ అకౌంట్ నుంచి మూడు విడతలుగా రూ.లక్షన్నర, మరో ఖాతా నుంచి రూ.20,900నగదు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. కంగారు పడి బ్యాంకుకు వెళ్లి విచారించగా అప్పటికే డబ్బులు డ్రా అయినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో గోపాల్‌రెడ్డి 1960 నంబర్‌కు ఫోన్‌చేసి తన బ్యాంకు అకౌంట్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు చోరీ చేశారని తెలియజేశాడు. అనంతరం నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

నేడు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక


ధ్రువీకరణ పత్రాలతో డైరెక్టర్లు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆదివారం జరగనుంది. ప్రధాన కార్యాలయంలోని మీటింగ్ హాలులో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు బ్యాంకు చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఉంటుందని, డైరెక్టర్లందరూ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారని ఎన్నికల అధికారి శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఆ తర్వాత నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం ఉంటుందన్నారు. చైర్మన్‌గా తడక రమేశ్ ఖరారు కాగా, వైస్ చైర్మన్ స్థానానికి ఏలే హరిశంకర్, భారత రాజేంద్రప్రసాద్, రాపోలు వేణు, సూరేపల్లి రమేశ్ పోటీపడుతున్నారు.

డైరెక్టర్ స్థానాలకు పూర్తయిన ఎన్నిక

పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు శుక్రవారం జరిగిన ఎన్నికలో 9 డైరెక్టర్ స్థానాలకు గాను 27 మంది పోటీపడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించి రాత్రి 2 గంటలకు పూర్తి ఫలితాలను వెల్లడించారు. తడక రమేశ్ ప్యానెల్ అత్యధికంగా 6 డైరెక్టర్ స్థానాలను కైవసం చేసుకొంది. జనరల్ స్థానాల డైరెక్టర్లుగా తడక రమేశ్ (1194 ఓట్లు), కర్నాటి వెంకట బాల సుబ్రమణ్యం (810 ఓట్లు), ఏలే హరిశంకర్ (711 ఓట్లు), భారత రాజేంద్రప్రసాద్ (682 ఓట్లు), సూరెపల్లి రమేశ్ (680 ఓట్లు), రాపోలు వేణు(670 ఓట్లు) గెలుపొందారు. అలాగే మహిళా డైరెక్టర్లుగా గుండు కావ్య (1136 ఓట్లు), కర్నాటి భార్గవి (952 ఓట్లు), ఎస్సీ స్థానం నుంచి డైరెక్టర్‌గా కొండమడుగు ఎల్లస్వామి (1113 ఓట్లు) గెలుపొందారు. గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల అధికారి, డిప్యూటీ రిజిస్ట్రార్ గోలి శ్రీనివాస్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

అనుమతి లేని ఆస్పత్రులు సీజ్


చౌటుప్పల్‌లో ఎముకల ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

చౌటుప్పల్ : పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో శనివారం వైద్యాధికారులు తనిఖీలు నిర్వహించారు. అనుమతి, అర్హత లేకుండా రోగులకు వైద్యసేవలు అందజేస్తున్న సాయిరాం, ప్రియాంక ఎముకల ఆస్పత్రులు, సంజీవిని ఫిజియోథెరపీ, అర్షమొలల ఆస్పత్రులను సీజ్ చేశారు. రోగులకు వైద్య సేవలు అందజేయాలంటే అందుకు అవసరమైన అన్ని రకాల అర్హతలు, అనుమతులు తప్పనిసరిగా ఉండాలని వైద్యాధికారులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులు ఏర్పాటు చేసినా, అర్హత లేని డాక్టర్లతో వైద్య సేవలు అందజేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. డబ్బు కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని, మానవతా దృక్పథంతో ఆలోచన చేయాలన్నారు. రోగులకు కూడా అనుమతి లేని ఆస్పత్రులు, అర్హత లేని వైద్యుల వద్దకు వెళ్లరాదని సూచించారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద, పీఓఎన్‌సీడీ డాక్టర్ సుమన్‌కళ్యాణ్, మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటంరాజు పాల్గొన్నారు.

కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణిని పరిశీలించిన యాదాద్రి ఆలయ ఈఓ


భక్తులతో మాట్లాడుతున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ కొండకు దిగువన ఉన్న కల్యాణకట్ట, అన్నదాన భవనం, లక్ష్మీపుష్కరిణిని ఆలయ ఈఓ భాస్కర్‌రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. నాయీ బ్రాహ్మణులు, పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడారు. అదేవిధంగా అన్న ప్రసాదం తయారీ విధానాన్ని పరిశీలించారు. నాణ్యతలో ఎలాంటి లోపం ఉండొద్దని వంట చేసే సిబ్బందికి సూచించారు. అనంతరం లక్ష్మీపుష్కరిణి, శ్రీస్వామి వారి పాదాలు, యాదరుషి కొలువైన ప్రాంతాలను పరిశీలించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

హాలియా : హాలియా వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మండలంలోని కుమ్మరికుంట (కేకే కాల్వ) గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. రైతులు మాట్లాడుతూ.. పులిమామిడి, కేకే కాల్వ గ్రామ శివారులోని సాగు చేసుకునేందుకు హాలియా వాగులో బోర్లు వేసి పైపులైన్ల ద్వారా పంట పొలాలకు నీరు సరఫరా చేసుకుంటున్నామని తెలిపారు. హాలియా వాగు ఇటు అనుముల మండలం, అటు కనగల్ మండలాలకు మధ్యలో ఉందని, దీంతో రెండు మండలాలకు చెందిన ఇసుక అక్రమ రవాణాదారులు హాలియా వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులకు చెప్పినా అడపదడపా దాడి చేసి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నా ఈ దందా ఆగడం లేదని తెలిపారు. హాలియా వాగు నుంచి ఇసుకను తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి తమ పంట పొలాలకు నీరందడం లేదని రైతులు వాపోయారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రైతుల సమస్యను దృష్టి ఉంచుకుని ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని న్యాయం చేయాలని రైతులు కోరారు. కాగా.. పులిమామిడి, కేకే కాల్వకు చెందిన 30 మంది రైతులు వాగు నుంచి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఫణిగిరి మ్యూజియానికి చేరిన బౌద్ధ శిల్పాలు



ఫణిగిరి మ్యూజియంలో భద్రపర్చిన బౌద్ధ శిల్పాలు

నాగారం: మండలంలోని ఫణిగిరి బౌద్ధ శిల్పాలు, జాతక కథలు తెలిపే తోరణాలను గత ఏడాది జూలైలో అంతర్జాతీయ ప్రదర్శన నిమిత్తం అమెరికాలోని న్యూయార్క్ మెట్రోపాలిటన్ మ్యూజియానికి, దక్షిణకొరియా సియోల్‌కి తీసుకెళ్లారు. ప్రదర్శన ముగిసిన అనంతరం శనివారం వీటిని తిరిగి ఫణిగిరి మ్యూజియంలో భద్రపర్చినట్లు పురావస్తు శాఖ ఏడీ మల్లునాయక్ తెలిపారు. న్యూయార్క్ మ్యూజియంలో ప్రపంచంలోని పురవస్తు శాఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఫణిగిరి బౌద్ధ శిల్పాలను సందర్శించారని పేర్కొన్నారు. ఫణిగిరి బౌద్ధక్షేత్రంలోని శిల్పాలను అంతర్జాతీయ ప్రదర్శనకు తరలించడంతో ప్రపంచ గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో పురవస్తు శాఖ ఏడీ బుజ్జి, సిబ్బంది వీరన్న, కార్తీక్, యాకయ్య ఉన్నారు.

జూదరుల అరెస్టు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ పరిసరాలు, కొండ కింద లక్ష్మీ పుష్కరిణి ప్రాంతాల్లో శనివారం ఎస్‌పీఎఫ్ పోలీసులు చేసిన తనిఖీల్లో నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పరకాలకు చెందిన గజరాల రాజు, సిరలేని కృష్ణ, హన్మకొండకు చెందిన కురాకుల శ్రీను, రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌కు చెందిన సంగూడం సుమన్‌లు శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. ఈ క్రమంలో పుష్కరిణి పరిసరాల్లో ఈ నలుగురు పేకాట ఆడుతూ ఎస్‌పీఎఫ్ పోలీసులకు కనిపించారు. దీంతో వీరిని పట్టుకొని యాదగిరిగుట్ట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈమేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ అవార్డుకు ఎంపిక

మిర్యాలగూడ టౌన్ : పట్టణ కేంద్రానికి చెందిన నారబత్తుల వెంకట నాగ బ్రహ్మాచారి 'సేవా రత్న నేషనల్ అవార్డు' 2024కు ఎంపికయ్యాడు. ఈ అవార్డును ఈనెల 25న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందజేయనున్నారు. ఆయన 20ఏళ్లుగా ఎలక్ట్రికల్ రంగంలో చేసిన సేవలను బహుజన సాహిత్య అకాడమి సంస్థ, నేషనల్ కమ్యూనిటీ ఆఫ్ ఇండియా వారు గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.